సాక్షి
నిర్మల్
శుక్రవారం । 19 । జూలై । 2024



సరిహద్దున హైఅలర్ట్ 8లో▸

మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో హైఅలర్ట్ నెలకొంది. ప్రజాప్రతినిధులు సమాచారం లేకుండా వెళ్లొద్దని సూచించారు.



వరదపై అప్రమత్తంగా ఉండాలి

కడెం ప్రాజెక్టుకు వస్తున్న వరదపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రాజెక్టు నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్ సూచించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
28.4 /24.2

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాలు, అల్పపీడనం ప్రభావంతో జిల్లా అంతటా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వ్యాసపౌర్ణమికి కలెక్టర్‌కు ఆహ్వానం



కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఈవో

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 19 నుండి 21 వరకు బాసరలో నిర్వహించే వ్యాస పౌర్ణమి ఉత్సవాలకు హాజరుకావాలని కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆహ్వానించారు. ఆలయ వైదిక బృందంతో కలిసి గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

భైంసా ఆర్టీసీ డీఎంగా హరిప్రసాద్



హరిప్రసాద్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రతిమారెడ్డి

భైంసాటౌన్: ఆర్టీసీ భైంసా డీఎంగా జి.హరిప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు డీఎంగా ఉన్న అమృత సస్పెండ్ కాగా, ఆమె స్థానంలో నిర్మల్ డీఎం ప్రతిమారెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం హరిప్రసాద్‌ను నియమించడంతో ఈ మేరకు బాధ్యతలు స్వీకరించారు. డిపో ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వన మహోత్సవం



మొక్కనాటి నీరు పోస్తున్న ఈవో

బాసర: బాసర శ్రీజ్ఞానసరస్వతి అమ్మవారి క్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు ఆలయ కార్యనిర్వహణ అధికారి విజయరామారావు ఆధ్వర్యంలో దేవస్థాన కార్యాలయ సిబ్బంది వైదిక బృందం కలిసి ఆలయ ప్రాంగణంలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ అడవుల సంరక్షణ, పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మొక్కల నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణం అందించినవాళ్లమవుతామన్నారు.

నేడు బీజేపీ జిల్లా సమావేశం

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్మల్ పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు తెలిపారు. సమావేశానికి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లా కోర్‌కమిటీ సభ్యులు, జిల్లా పదాధికారులు, పార్టీ మండలాధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

విదేశీ విద్యాపథకానికి దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్ర అల్పసంఖ్యాక వర్గ సంక్షేమ శాఖ ద్వారా విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించే పేద మైనారిటీ (ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీల)విద్యార్థుల నుంచి ముఖ్యమంత్రి విదేశీ విద్యాపథకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అల్పసంఖ్యాకవర్గాల జిల్లా అధికారి మోహన్‌సింగ్ తెలిపారు. ఈ పథకం ద్వారా పేద మైనారిటీ విద్యార్థులకు రూ.20 లక్షల ఉపకార వేతనం, ఒక వైపు విమాన చార్జీల కింద రూ.60 వేలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. డిగ్రీ (ఇంజనీరింగ్)లో 60 శాతం మార్కులు ఉండి పోస్ట్ గ్రాడ్యుయేట్ చేయాలనుకునేవారు, పీజీలో 60 శాతం మార్కులు పొంది పీహెచ్‌డీ చేయాలనుకునేవారు పథకానికి అర్హులని తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు మధ్యకాలములో విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందిన మైనారిటీ విద్యార్థులు www.telanganaepass.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తులకు చివరి తేదీ ఆగస్టు 8 అని పేర్కొన్నారు. సంభందిత దరఖాస్తు ఫారంల హార్డ్ కాపీలు జిల్లా అల్పసంఖ్యాకవర్గాల సంక్షేమ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

రుణం మాఫీ.. రైతు హ్యాపీ..

- తొలి విడత రూ.లక్ష లోపు రుణాలు మాఫీ..
- రైతు ఖాతాల్లో రూ.171.77 కోట్లు జమ
- జిల్లాలో 30,106 మంది రైతులకు లబ్ధి
- జిల్లా అంతటా సంబురాలు..

భైంసా: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మూడు విడతల్లో రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం 4 గంటలకు బటన్ నొక్కి తొలి విడతగా రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా రైతులతో కలిసి కాంగ్రెస్ నాయకులు కలిసి సంబురాలు నిర్వహించారు. ఇదిలా ఉండగా రుణమాఫీ సందర్భంగా రైతు వేదికల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వ్యవసాయాధికారులు రుణమాఫీ జాబితాను క్లస్టర్లవారీగా ప్రదర్శించారు. అయితే ఏ రైతుకు ఎంత రుణం మాఫీ అయ్యింది అనేది మాత్రం జాబితాలో పేర్కొనలేదు. జాబితా ప్రకారం మాత్రం జిల్లాలో 30,106 మంది రైతుల రుణాలు తొలి విడతలో మాఫీ అయ్యాయి. ఈమేరకు ప్రభుత్వం ఆ రైతుల ఖాతాల్లో రూ.171.77 కోట్లు జమ చేసిందని అధికారులు తెలిపారు. రుణమాఫీ అయిందని అధికారికంగా సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రకటించడంతో ఊరూరా పండుగ వాతావరణంలో వేడుకలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

పేర్లు లేక ఆందోళన...

ఇదిలా ఉంటే.. జిల్లాలో చాలా మంది రైతులు జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మొదటి జాబితాలో లక్షలోపు రుణం ఉన్నచాలా మంది రైతుల పేర్లు గల్లంతయ్యాయి. జాబితాలో పేర్లులేని వారంతా అధికారులకు ఫోన్ చేసి ఆరా తీస్తున్నారు. ఏఈవోల వద్దకు వెళ్లి తమ పేరు ఎందుకురాలేదని అడుగుతున్నారు. ప్రభుత్వం విడుదలచేసిన మార్గదర్శకాల మేరకు కుటుంబం మొత్తం తీసుకున్న రుణం రూ.లక్ష దాటితే వారి పేర్లు జాబితాలో ఉండవని అధికారులు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాల్లో పేర్లు తప్పుగా ఉన్నవారి వివరాలు కూడా హోల్డ్‌లో పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు. మరోసారి విచారణచేసి రుణమాఫీ అయ్యేలా చూస్తామని తెలిపారు.

అంతటా సంబురాలు...

పంటల రుణాల మాఫీ ప్రక్రియ మొదలైన సందర్భంగా జిల్లావ్యాప్తంగా సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు వేడుకలు నిర్వహించారు. పట్టణ కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు, అంబేద్కర్ విగ్రహాలకు పాలాభిషేకాలు నిర్వహించారు. టపాసులు కాల్చి మిఠాయిలు పంచారు. ఖానాపూర్, నిర్మల్, ముధోల్ నియోజకవర్గాల్లో సంబురాలు అట్టహాసంగా నిర్వహించారు. రైతు వేదికల వద్ద నిర్వహించిన సంబురాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



దస్తురాబాద్: సంబరాల్లో రైతులతో కలిసి ఎండ్ల బండి నడుపుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

దస్తురాబాద్: రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన రైతు రుణామాఫీ సంబరాల్లో పాల్గొని మాట్లాడారు. రైతు సంక్షేమ కోసం కృషి చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ లక్ష రూపాయాల రుణం మాఫీ చేయలేకపోయారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం పంట రుణాలు మాఫీ చేసి చూపించామన్నారు. అంతకుముందు రైతులు మండలంలోని బుట్టాపూర్, రేవోజీపేట, మున్యాల, పెర్కపల్లె, దస్తురాబాద్ మీదుగా ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎడ్ల బండి, ట్రాక్టర్ నడిపి రైతులను ఉత్సాహపరిచారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి రైతులు, నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేశ్, నాయకులు రమేశ్‌రావు, సింగరి కిషన్, నరేశ్‌రెడ్డి, శ్రీనివాస్, శివయ్య, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చరిత్రాత్మకం

- డీసీసీ చీఫ్ శ్రీహరిరావు



క్షీరాభిషేకం చేస్తున్న శ్రీహరిరావు

లక్ష్మణచాంద: రైతుల రుణమాఫీ చరిత్రాత్మకమని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని రైతులతో కలిసి వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీకి శ్రీకారం చుట్టిందన్నారు. మొదటి విడతగా గురువారం రూ.లక్షలోపు రుణాలు మాఫీ చేసిందని తెలిపారు. రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రైతులతో కలిసి కేక్ కట్ చేశారు. వేడుకల్లో వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటరాజు, తాజా మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, నాయకులు ఈటెల శ్రీనివాస్, నరేశ్‌రెడ్డి, లింగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమేశ్, భీమన్న, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మాఫీ అయ్యింది



బ్యాంకులో రూ.70 వేల పంట రుణం తీసుకున్న. జాబితాలో నా పేరు వచ్చింది. రుణమాఫీ చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. పోయిన ఏడు.. చెరువు తెగి నాకున్న రెండు ఎకరాల భూమిపూర్తిగా బండరాళ్ల గుట్టగా మారింది. నా భూమిని చదునుచేసి తెగిన చెరువును కట్టాలని ప్రభుత్వానికి కోరుతున్న.

– బట్టు రుక్మాబాయి, మహిళా రైతు

సంతోషంగా ఉంది



రుణమాఫీ కావడం సంతోషంగా ఉంది. మొదటి జాబితాలో నా పేరు వచ్చింది. ఎంత మాఫీ అయ్యిందనేది తెల్వది. బ్యాంకుకు వెళ్లి వివరాలు తెలుసుకుంటా. కష్టకాలంలో మాలాంటి రైతులకు ఈ డబ్బులు ఉపయోగపడుతాయి. ఈ సీజన్‌లో ఇవే డబ్బులతో సాగుపై పెట్టుబడి పెడతాం.

– కాత్రే మారుతి, రైతు

బాకీ తీసుకునే బాధ తప్పింది..



పంట రుణమాఫీతో బాకీ తీసుకునే బాధ తప్పింది. గతేడు పంటలు పండలేదు. ఈయేడు కూడా అనుకున్నంత వర్షాలు లేవు. ఎక్కడ వెళ్లినా అప్పు పుట్టడంలేదు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం పంట రుణం మాఫీచేసింది. మాఫీచే సిన డబ్బులు మా ఖాతాల్లో జమ అవుతున్నాయి. మాకు ఇబ్బందులు తప్పినయ్. – కొడిగిరి శంకర్, రైతు

ఎదురుచూపులు తప్పినయ్..



పంట రుణం మాఫీతో ఎదురుచూపులు తప్పాయి. డిసెంబర్ నుంచి పంట రుణమాఫీ కోసం నిరీక్షిస్తున్నాం. ఇప్పటికీ మా కల నెరవేరింది. లక్షలోపు రుణమాఫీలో పేరురావడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ ప్రకటనతో విడుదలైన జాబితాలో నా పేరు వచ్చింది. మాఫీ కావడం ఆనందంగా ఉంది.

– సాయినేని సుదర్శన్‌రావు, రైతు

రుణమాఫీలో సమస్య తలెత్తకుండా చూడాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి రైతు రుణమాఫీలో మొదటి విడతలో జిల్లాలో 30,106 మంది రైతుల ఖాతాల్లో రూ.171.76 కోట్లు జమ చేయడం జరుగుతుందని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులంతా సమన్వయంతో పనిచేసి అర్హుల రుణాలు మాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు రుణమాఫీ – 2024 కు సంబంధించి జిల్లాలోని వివిధ బ్యాంకుల మేనేజర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతల్లో రూ.2 లక్షల వరకు రుణాలు మాఫీ చేస్తుందని తెలిపారు. మొదటి విడతలో రూ.లక్ష లోపు రుణాలు గురువారం సాయంత్రం 4 గంటలకు మాఫీ చేస్తుందని పేర్కొన్నారు. రుణమాఫీ నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయడంలో ఎలాంటి సమస్యలు లేకుండా బ్యాంకు మేనేజర్లు, వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామ్‌గోపాల్ వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్ఎస్‌ను తనిఖీ చేసిన డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

ఖానాపూర్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను డీఈవో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, బోధన తీరుపై ఆరా తీశారు. విద్యార్థులకు చాప్టర్ వైస్‌గా వీక్లీ టెస్టులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదివి 10 జీపీఏ సాధించేలా కృషి చేయాలన్నారు. డీఈవో వెంట హెచ్‌ఎం సంధ్యారాణి ఉన్నారు.

సామాన్యుడికి భరోసా కల్పించాలి

- బేసిక్ పోలీసింగ్‌పై శ్రద్ధ పెట్టాలి
- డయల్ 100ను పటిష్టం చేయాలి
- మహిళలు చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి
- నేరాలపై రివ్యూ చేయాలి..
- ఎస్పీ జానకీషర్మిల



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: సామాన్యులకు భరోసా కల్పించేలా పోలీసులు విధులు నిర్వహించాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. ఆదర్శంగా ఉండాల్సినవారు అనైతిక చర్యలకు పాల్పడితే క్రమశిక్షణ చర్యలతోపాటు, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయం నుంచి జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని కానిస్టేబుల్ స్థాయి నుంచి ఏఎస్పీ స్థాయి అధికారులతో గురువారం కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. ఇటీవల హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో పోలీసులకు జారీ చేసిన ఆదేశాలను, సూచనలను వివరించారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ పెంపొందించి, కేసుల దర్యాప్తును పూర్తి చేయాలని సూచించారు. డయల్ 100 పటిష్టం చేయాలన్నారు. దొంగతనాల నివారణకు ప్రతీ సర్కిల్ పరిధిలో ఒక స్పెషల్ టీంను నియమించాలని తెలిపారు. ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే ప్రాంతాలపై నిఘా ఉంచాలని తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

జిల్లాలో కురుస్తున్న వర్షాల దృష్ట్యా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, ముంపునకు గురయ్యే ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ.. ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బ్రిడ్జిలు, చెరువుల దగ్గర బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాలపై శ్రద్ధ వహించాలి

రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులతో కలిసి ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అమాయక ప్రజల భూములు కబ్జా చేసిన వారిని, బెదిరించి భూములు లాక్కున్నవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గంజాయి రవాణాను అరికట్టాలి

జిల్లాలోని రాష్ట్ర సరిహద్దుల నుంచి వచ్చే గంజాయి రవాణాను అరికట్టాలన్నారు. గుట్కా, ఇసుక అక్రమ రవాణా, పేకాట, గుడుంబా, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా ఉంచాలన్నారు. ప్రతీరోజు రాత్రి దుకాణాలు 10 గంటలకు మూసివేయాలని, యజమానులకు నిబంధనలు వివరించాలని ఆదేశించారు. రద్దీగా ఉండే ప్రాంతాలను గుర్తించి బారికేడ్లను కూడా ఏర్పాటు చేయాలని చెప్పారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించాలి

ఫోన్ల ద్వారా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఓటీపీ ఫ్రాడ్ గురించి ఉదాహరణలు చూపించాలని పేర్కొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వండి

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించడం వల్ల ప్రజలు సంతృప్తి చెందుతారని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేయాలని, ప్రజలతో మర్యాదగా పూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్లు ప్రతీనెల తప్పనిసరిగా పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు.

మున్సిపల్ కమిషనర్లతో 'సాక్షి' ఫోన్‌ఇన్

భైంసా టౌన్: వర్షాకాలం.. వ్యాధుల కాలం. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వ్యాధులు ముసురుకునే ప్రమాదం ఉంది. వర్షపు నీరు నిలిచి దోమలు వృద్ధి చెందే అవకాశముంది. డెంగీ, మలేరియాతోపాటు ఇతర వ్యాధులు సోకే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఆధ్వర్యంలో చేపడుతున్న పారిశుధ్య పనులు, పట్టణ ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై భైంసా మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ సుదర్శన్‌రెడ్డి, ఖనాపూర్ మున్సిపాలిటీ కమిషనర్ మనోహర్‌తో శనివారం ఫోన్‌ఇన్ కార్యక్రమంలో మాట్లాడవచ్చు.

అంశం: పారిశుధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

భైంసా



మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ సుదర్శన్‌రెడ్డి

సమయం : శనివారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు

95151 21070

ఖానాపూర్



మున్సిపల్ కమిషనర్ మనోహర్

సమయం : మధ్యాహ్నం 12:00 నుంచి 1:00 వరకు

85000 23363

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

ఉమ్మడి సర్వీస్‌రూల్స్ సాధనకు కృషి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కె.రఘోత్తంరెడ్డి



సభ్యత్వ నమోదు చేస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

భైంసాటౌన్/నర్సాపూర్ (జి): రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను త్వరలోనే సాధిస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, పీఆర్టీయూ నేత కూర రఘోత్తంరెడ్డి అన్నారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో, నర్సాపూర్(జీ)లోని పాఠశాలలో గురువారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఎమ్మెల్సీ పాల్గొని మాట్లాడారు. ఎంఈవో, జేఎల్, డైట్ అధ్యాపకులు, డిప్యూటీ ఈవో పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వంతో చర్చించామన్నారు. ఉమ్మడి సర్వీస్‌రూల్స్‌పై సైతం సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించినట్లు పేర్కొన్నారు. త్వరలోనే నిబంధనలు వస్తాయని తెలిపారు. ఇటీవలే ఉపాధ్యాయ పదోన్నతులు పూర్తి చేశామని, మిగతా పోస్టులకు త్వరలోనే షెడ్యూల్ వచ్చేలా చూస్తామన్నారు. అలాగే సీపీఎస్ రద్దు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు జీవో 317 బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కస్తూరిబా, ఆదర్శ, ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీలు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పాఠశాలల్లో ఉచిత విద్యుత్తును కల్పించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి బీవీ.రమణారావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గజ్జారాం, నర్సాపూర్(జి) మండల అధ్యక్షుడు సదానందం, జనరల్ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్ ,గంగా చరణ్, భూమేశ్వర్, సిద్ధిరాం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ముథోల్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి చేస్తుందని ఉపాధ్యాయ ఎమ్మెల్యే కె.రఘోత్తంరెడ్డి తెలిపారు. ముథోల్, పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, బి.రమణారావు, ప్రతినిధులు గంగాధర్, రవీందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, అహ్మద్, ఎంఈవో మైసాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతి

నిర్మల్‌చైన్‌గేట్/భైంసాటౌన్: గతంలో 15 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలు నెరవేర్చాలని వెంటనే అమలు చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు ఎమ్మెల్యేలకు గురువారం వినతిపత్రాలు అందించారు. నిర్మల్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సహాయకునికి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ నివాసానికి వెళ్లి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. భైంసాలోని భోకర్ చౌరస్తా నుంచి ర్యాలీగా ఎస్ఎస్ కాటన్‌లోని ఎమ్మెల్యే రామారావుపటేల్ నివాసానికి చేరుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను మోసం చేస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు చంద్రకళ, గంగామణి, సుజాత మాట్లాడారు. ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.26 వేలు, పీఎఫ్, ఈఎస్‌ఐ, రూ.50 లక్షల ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. దీనికోసం గత సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 9 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజులు నిరవధిక సమ్మె చేశామన్నారు. నాటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆశ యూనియన్ రాష్ట్ర కమిటీతో చర్చలు జరిపి కొన్ని నిర్దిష్టమైన హామీలు ఇచ్చారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తమ మేనిఫెస్టోలో ఆశ వర్కర్లకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. సమస్యలు పరిష్కారానికి ఆరోగ్య శాఖ మంత్రి, ఆరోగ్య శాఖ రాష్ట్ర అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తి చేశామని చెప్పారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు జె.లక్ష్మి, సుగుణ, భైంసా డివిజన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, నా యకులు శ్యామల, లావణ్య, భాగ్య, విజయ, సుధ, అనురాధ, పద్మ, సరోజ, లక్ష్మి, పద్మ, రామలక్ష్మి, సుజాత, బి.రాధ, బి ఇంద్రమాల, శ్రీలత పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఆశ కార్యకర్తలు

క్లుప్తంగా

బిర్యానీలో పురుగు.. హోటల్ సీజ్..!



హోటల్‌కు తాళం వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

భైంసాటౌన్: పట్టణంలోని కమల థియేటర్ సమీపంలోని ఓ బిర్యానీ సెంటర్‌లో ఆహారంలో పురుగు రావడంతో మున్సిపల్ అధికారులు హోటల్‌కు తాళం వేశారు. వినోద్, నరేశ్ అనే కస్టమర్లు గురువారం హోటల్‌లో భోజనం చేసేందుకు వచ్చారు. సిబ్బంది తెచ్చిన భోజనంలో పురుగు ఉన్నట్లు గుర్తించి నిర్వాహకుల దృష్టికి తెచ్చారు. ఈ దృశ్యాన్ని వీడియో తీసి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారులు చూపిన వీడియో ఆధారంగా హోటల్‌కు తాళం వేసినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆపరేషన్ ముస్కాన్‌లో బాల కార్మికుల గుర్తింపు



బాలలతో అధికారులు

కుభీర్: మండల కేంద్రమైన కుభీర్‌లో వివిధ దుకాణాలలో పనిచేస్తున్న ముగ్గురు బాలకార్మికులను ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా అధికారులు గుర్తించారు. వారి తల్లిదండ్రులు, దుకాణాల యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ఈ సందర్భంగా సబ్ ఇన్‌స్పెక్టర్ నారాయణ్‌సింగ్ మాట్లాడుతూ పిల్లల హక్కులు కాపాడటం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు సలార్, రమేశ్, మహిళాకానిస్టేబుల్ అనుప్రియ పాల్గొన్నారు.

రుణమాఫీ పేరుతో ఫేక్ లింక్‌లు

నిర్మల్‌టౌన్: రైతు రుణమాఫీ అంటూ కొందరు ఫేక్ లింకులు సెల్‌ఫోన్లకు పంపుతున్నారని, వాటిని ఓపెన్ చేయవద్దని ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. మెస్సేజ్ లింక్ వస్తే 1930 ఫి ర్యాదు చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్ర మం నేపథ్యంలో కొందరు సైబర్ నేరగాళ్లు బ్యాంకుల పేరిట వాట్సాప్‌లో ఏపీకే ఫైల్ పంపిస్తున్నారని తెలిపారు. అది యాక్సెప్ట్ చేసి ఇన్‌స్టాల్ చేస్తే మీ ఫోన్ సైబర్ నేరగాళ్ల కంట్రోల్‌లోకి వెళ్తుందని పేర్కొన్నారు. ఎలాంటి లింకులు ఓపెన్ చేయవద్దని సూచించారు. ఎవరైనా మోసపోతే వెంటనే 1930కి లేదా http:// www.cybercrime.gov.inలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

సరిహద్దున హైఅలర్ట్

- మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఎన్‌కౌంటర్
- 12 మంది మావోయిస్టులు మృతి
- సరిహద్దులో అప్రమత్తమైన ఉమ్మడి జిల్లా పోలీసులు



ఎన్‌కౌంటర్ జరిగిన వందోళి అటవీ ప్రాంతం

చింతలమానెపల్లి: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా వందోళి అటవీ ప్రాంతంలోని ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఉమ్మడి జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో హైఅలర్ట్ పరిస్థితి నెలకొంది. ఎన్‌కౌంటర్‌పై గడ్చిరోలి జిల్లా ఎస్పీ నీలోత్పల్ గురువారం వివరాలు వెల్లడించారు. జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో విధ్వంసక ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నట్లు ఆయన వివరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వారోత్సవాల నేపథ్యంలో కోర్చి- తిప్పగఢ్, చత్‌గావ్- కసన్‌సూర్ ఉమ్మడి దళ సభ్యులు సుమారుగా 12 నుంచి 15 మంది గడ్చిరోలి జిల్లా వందోళి సరిహద్దులోని అటవీ ప్రాంతంలో విడిది చేసినట్లు విశ్వసనీయ సమాచారం అందింది. బీవైఎస్పీ విశాల్ నాగర్ గోజె నేతృత్వంలోని సీ- 60 కమాండోల బృందంలోని 7 యూనిట్లను అప్రమత్తం చేశారు. అనుమానాస్పద ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు కాల్పులు జరిపారు. అప్రమత్తమైన కమాండోలు తిరిగి ఫైరింగ్ చేయగా.. మావోయిస్టుల నుంచి కాల్పులు నిలిచిపోయాయి. అనంతరం సీ- 60 కమాండో దళాల ఆధ్వర్యంలో గాలింపు చేపట్టగా 12 మంది మావోయిస్టుల మృతదేహాలు లభించాయి. వీరిలో ఏడుగురు పురుషులు కాగా.. ఐదుగురు మహిళలు ఉన్నట్లు గుర్తించారు. చత్‌గావ్- కస్నసూర్ దళం ఇన్‌చార్జి డీవీసీఎం యోగేశ్ దేవ్‌సింగ్(36), కోర్చి- తిప్పగఢ్ దళం ఇన్‌చార్జి డీవీసీఎం ఆత్రం విశాల్ కుల్లె అలియాస్ ఆత్రం లక్ష్మణ్(47), తిప్పగఢ్ ఇన్‌చార్జి డీవీసీఎం ప్రమోద్ లాల్‌సే కచ్లామి అలియాస్ దళపత్(31), చత్‌గావ్- కస్నసూర్ డిప్యూటీ కమాండ్, ఏరియా కమిటీ సభ్యుడు మహారు ధోబి గవాడె (31), కోర్చి- తిప్పగఢ్ దళం డిప్యూటీ కమాండర్, ఏరియా కమిటీ సభ్యుడు అనిల్ దేవ్‌సాయ్ డర్రో అలియాస్ దేవా(28), ఏరియా కమిటీ సభ్యుడు విజ్జు చటగావ్-కస్నసూర్, చత్‌గావ్-కస్నసూర్ ఏరియా కమిటీ సభ్యురాలు సరిత జార పర్సె అలియాస్ మీనా అలియాస్ రామే(37), చత్‌గావ్ -కస్నసూర్ దళం ఏరియా కమిటీ సభ్యురాలు రజ్జో మంగల్ సింగ్ గవాడె అలియాస్ సమితా సిరోంటి(35), చత్‌గావ్-కస్నసూర్ దళ సభ్యురాలు రోజా, దళ సభ్యుడు సాగర్, కోర్చి- తిప్పగఢ్ దళ సభ్యురాలు చందా పొడియం, కోర్చి- తిప్పగఢ్ దళ సభ్యురాలు సీతా హవికె(27) ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారిపై దహనం, హత్య లాంటి అనేక నేరాలు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లండించారు. ఏడు ఆటోమేటిక్ ఆయుధాలు, 11 తుపాకులు, మూడు ఏకే 47, రెండు ఇన్సాస్, ఒకటి కార్బైన్, ఒకటి ఎస్ఎల్ఆర్, పెద్దసంఖ్యలో విప్లవ సాహిత్యం, పేలుడు పదార్థాలు, డిటోనేటర్లు, బీజీఎల్‌లు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఘటనలో సీ- 60 కమాండో దళానికి చెందిన శంకర్ పాటావి, వివేక్ షింగోల్‌కు బుల్లెట్ గాయాలు కాగా.. వీరిని హెలికాప్టర్ ద్వారా నాగ్‌పూర్‌కు చికిత్స కోసం తరలించారు. ఈ ఆపరేషన్ ఐజీ ఏఎన్‌వో సందీప్ పాటిల్, గడ్చిరోలి రేంజ్ డీఐజీ అంకిత్ గోయల్, గడ్చిరోలి ఎస్పీ నీలోత్పల్, అదనపు ఎస్పీలు యతీశ్ దేశ్‌ముఖ్, కుమార్ చింతా, అహేరి అదనపు ఎస్పీ ఎం.రమేశ్, డీవైఎస్పీ విశాల్ నాగర్ గోజె ఆధ్వర్యంలో జరిగినట్లు అధికారులు వెల్లడించారు.

సరిహద్దు మండలాల్లో నిఘా..

సరిహద్దున జరిగిన ఎన్‌కౌంటర్ నేపథ్యంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. సరిహద్దు మండలాల్లో నిఘా పెంచారు. కాగజ్‌నగర్ పోలీస్ డివిజన్ పరిధిలోని సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, దహెగాం మండలాలు మహారాష్ట్ర సరిహద్దున ఉన్నాయి. ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల్లో సరిహద్దు ప్రాంతాలైన అహేరి, ఏటపల్లి, భామ్రాగఢ్‌కు చెందిన వారు ఉన్నారు. మహారాష్ట్ర వైపు కొంత ఆందోళనకర వాతావరణం ఉంది. ఎన్‌కౌంటర్ జరిగిన సమయంలో గాయాలపాలైన, తప్పించుకున్న వారు తెలంగాణ వైపు వచ్చి ఉండవచ్చనే అనుమానాలను మహారాష్ట్ర పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పోలీసులు సైతం ఈ దిశగా నిఘా పెంచారు. దళాల ఆధ్వర్యంలో కూంబింగ్ కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. పోలీసులకు సమాచారం అందించకుండా సరిహద్దు ప్రాంతాలకు ప్రజాప్రతినిధులు వెళ్లవద్దని పోలీసు అధికారులు హెచ్చరికలు చేశారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, అహేరి ఎమ్మెల్యే ఆత్రం ధర్మారావు బాబాతో గురువారం సమావేశం కావాల్సి ఉండగా.. పోలీసు అధికారుల సూచనతో రద్దయింది.

అప్రమత్తంగా ఉన్నాం

జిల్లా పోలీసులు మావోయిస్టు కదలికలపై అప్రమత్తంగా ఉన్నారని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ తెలిపారు. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో నిఘా పెంచామని పేర్కొన్నారు. ఆయా మండలాల స్టేషన్లకు సూచనలు చేశామన్నారు. కూంబింగ్ యథావిధిగా నడుస్తోందన్నారు. ఎలాంటి పరిస్థితిని అయినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు.

ముగిసిన మొహర్రం వేడుకలు

- రద్దీగా హుస్సేన్ హుస్సేన్ దేవస్థానం



పీరీలకు వేసిన రూ.500 నోట్ల మాల కొనుగోలు చేస్తున్న మహిళ



రుయ్యాడిలో పీరీలను ఊరేగిస్తున్న భక్తులు

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామం మొహర్రం ఉత్సవాలకు ప్రసిద్ధిగాంచింది. వేడుకలు గురువారం ఘనంగా ముగిశాయి. ఇక్కడి హుస్సేన్ హుస్సేన్ దేవస్థానంలో పీరీలను దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు వర్షాన్ని కూడా లెక్క చేయకుండా అధికసంఖ్యలో వచ్చారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా నిజామాబాద్, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నుంచి ప్రత్యేక వాహనాల్లో వచ్చి పూజలు చేసి మొక్కు తీర్చుకున్నారు. దీంతో భక్తులతో దేవస్థానం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పీరీల ఊరేగింపు నిర్వహించారు. దేవస్థానంలో తీసిన గుండంను భక్తిశ్రద్ధలతో పూడ్చారు. గుండం చుట్టూ అధికసంఖ్యలో యువకులు అసైదులా ఆడారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దేవస్థాన అధ్యక్షుడు లోక భూమారెడ్డి, తాజా మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గోక గణేశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పోతారెడ్డి, మాజీ రైతు సమన్వయకర్త జీవన్‌రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన వెళ్లి.. వైద్యం అందించి..



రాజులగూడకు బురదరోడ్డుపై కాలినడకన వెళ్తున్న వైద్య సిబ్బంది

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం నర్సాపూర్ ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది బురద రోడ్డులో రెండు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి రాజులగూడ గ్రామస్తులకు వైద్యం అందించారు. వివరాలు.. సిరిచెల్మ ఆరోగ్య ఉపకేంద్రం హెల్త్‌అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ, ఏఎన్ఎం రేణుక, ఎంఎల్‌హెచ్‌వో సంగీత, ఆశ కార్యకర్తలు గంగామణి, లక్ష్మి నారాయణపూర్ పంచాయతీ పరిధిలోని రాజులగూడలో గురువారం వైద్యశిబిరం నిర్వహించాల్సి ఉంది. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి రోడ్డు బురదమయమైంది. అయినా సిబ్బంది ఎంతో శ్రమకోర్చి రెండు కిలోమీటర్ల కాలినడకన గ్రామానికి చేరుకున్నారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి 12 మంది రక్త నమూనాలు సేకరించారు. గర్భిణులు, బాలింతలకు రోగ నిరోధక టీకాలు వేశారు. మరో 95మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ముఖరా(కే) మాజీ సర్పంచ్‌కు కేంద్ర మంత్రి అభినందన



ట్విట్టర్‌లో మీనాక్షిని అభినందించిన మంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముఖరా(కే) మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షిని కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్‌ట్విట్టర్ వేదికగా అభినందించారు. పదవీ కాలం పూర్తయినా గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, దోమల నివారణకు ఆమె పిచికారీ చేసిన ఫొటోను ఆయన ట్వీట్ చేసి అభినందనలు తెలిపారు.

వైన్స్‌లో చోరీ



వైన్స్ షటర్ తాళం పగలగొట్టి ఉన్న దృశ్యం

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలోని వైన్స్‌లో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గురువారం ఉదయం వైన్స్ పరిసరాలు శుభ్రం చేసేందుకు వెళ్లిన సాయన్న షటర్ తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించి వైన్స్ నిర్వాహకుడు వసంత్‌రెడ్డికి సమాచారం అందించాడు. నిర్వాహకుడు పోలీసులకు సమాచారం అందించడంతో వచ్చి పరిశీలించగా షటర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. షాపు లోపల సీసీ కెమెరాలు, డీవీఆర్, మానిటర్‌ను దొంగలు ధ్వంసం చేశారు. దుకాణంలోని రూ.12,00 విలువైన మద్యం, కౌంటర్‌లోని రూ.3 వేల నగదు ఎత్తుకెళ్లారు. వైన్స్ నిర్వాహకుడు వసంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మాన్‌సింగ్ పేర్కొన్నారు.

కల్లు దుకాణంలో..

మండల కేంద్రంలోని కల్లు దుకాణంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గురువారం ఉదయం కల్లు దుకాణం పరిసరాలు శుభ్రం చేసేందుకు వెళ్లిన పిట్ల సాయన్న దుకాణం తాళం పగలగొట్టి ఉండడం గమనించి యజమానికి సమాచారం అందించాడు. యాజమాని లక్ష్మణ్‌గౌడ్ వచ్చి పరిశీలించగా సీసీ కెమెరాలు, డీవీఆర్‌ను ధ్వంసం చేసి కౌంటర్‌లోని రూ.610 నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. లక్ష్మణ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మాన్‌సింగ్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి గ్రా మంలోని ఆదిలాబాద్ రైతు ఉత్పత్తిదారుల సంస్థతోపాటు అగ్రి ఇన్‌పుట్ స్టోర్‌లో పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీఈవో సుమన్ తెలిపారు. ఇంటర్‌లో సీఈసీ, డిగ్రీలో బీకాం చేసి వారు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పక ఉండాలన్నారు. వివరాలకు 9963104247 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అదేతీరు.. అవే తిప్పలు





ఆదిలాబాద్ పట్టణంలోని పలు ప్రాంతాల్లోగల రోడ్లపై పశువులు సంచరిస్తున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులకు అనేక ఇక్కట్లు ఎదురవుతున్నాయి. మూగజీవాలను రోడ్లపై వదిలేసిన పశువుల యజమానులకు గతంలో మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. ఆ పశువుల కోసం గోశాల ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దాని ఊసే లేకుండా పోయింది. దీంతో అధికసంఖ్యలో పశువులు రోడ్లపై తిరుగుతుండడంతో పలు సందర్భాల్లో చిన్నపాటి ప్రమాదాలూ చోటుచేసుకుంటున్నాయి. పశువులు రోడ్లపై సంచరించకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

యంత్రం సాయంతో బౌలింగ్





పోలీసుల శారీరక ధృఢత్వం కోసం ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. స్పెషల్ పార్టీ సిబ్బంది శారీరక ధృఢత్వం, ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు శిక్షణ, రోజువారీ దినచర్యలో భాగంగా వారి కోరిక మేరకు క్రికెట్ బౌలింగ్ యంత్రం ఏర్పాటు చేశారు. దీని ద్వారా శిక్షణ ఇస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

బాసరలో ఎమ్మెల్సీ పూజలు



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బాసర: నిర్మల్ జిల్లా బాసర జ్ఞానసరస్వతి అమ్మవారిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి గురువారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. తర్వాత బాసర ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో రఘోత్తంరెడ్డి పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి చేస్తుందన్నారు. కాంప్లెక్స్ ప్రాంగణంలో సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. బాసర ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న చరిత్ర పరిశోధకుడు బలగం రామ్మోహన్‌ను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సయ్య పాఠశాల తరఫున రఘోత్తంరెడ్డిని సన్మానించారు. పాఠశాలలో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికులు వారి సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొనగిరి రమేశ్, ఎంఈవో మైసాజీ, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరదపై అప్రమత్తంగా ఉండాలి

- సీఈ శ్రీనివాస్
- కడెంలో 687 అడుగుకుల చేరిన నీటిమట్టం



ప్రాజెక్ట్ రికార్డులను పరిశీలిస్తున్న సీఈ శ్రీనివాస్

కడెం: కడెం ప్రాజెక్టుకు వస్తున్న వరదపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రాజెక్టు నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్ సూచించారు. నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టును గురువారం సందర్శించారు. ప్రాజెక్ట్ మరమ్మతు పనులు, రికార్డులను పరిశీలించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు వచ్చిన ఇన్‌ఫ్లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్‌ఈ రవీందర్, ఈఈ విఠల్, డీఈ బోజదాసు ఉన్నారు.

687 అడుగులకు నీటిమట్టం..

కడెం ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. పూర్తిస్థాయి నీటిమట్టం 700(7.603 టీఎంసీ) అడుగులు కాగా, గురువారం 687.025(4.677 టీఎంసీ) అడుగులకు చేరినట్లు ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టులోకి 2,646 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు తెలిపారు.

నియోజకవర్గ అభివద్ధికి కృషి చేస్తా

- ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేశ్



ఎంపీని సన్మానిస్తున్న అంజు కుమార్ రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కర్తవ్యంగా కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేశ్ అన్నారు. బీజేపీ కార్యాలయానికి మొదటిసారిగా వచ్చిన సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి ఎంపీని సన్మానించారు. అనంతరం నగేష్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మంచి మెజారిటీ ఇచ్చినందుకు ప్రజలకు, గెలుపునకు కృషి చేసిన బీజేపీ నాయకులు, కార్యకర్తలకు, నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసిమ్మె రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు అలివేలుమంగ, జిల్లా కార్యదర్శి కొలిపెల్లి శ్రావణ్‌రెడ్డి, దళితమోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు ఒడిశాల అర్జున్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అయ్యన్నగారి రాజేందర్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీగాదే విలాస్, నాయకులు పాల్గొన్నారు.

బదిలీ అవకాశం కల్పించండి



హైదరాబాదులో బుర్ర వెంకటేశంకు వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

నిర్మల్‌రూరల్: ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు బదిలీల షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ షెడ్యూల్‌లోనే తమకు కూడా బదిలీ అవకాశం కల్పించాలని నూతనంగా రెగ్యులరైజ్ అయిన అధ్యాపకులు కోరారు. ఈమేరకు హైదరాబాదులో విద్యాశాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశంకు గురువాం వినతిపత్రం అందజేశారు. 15 ఏళ్లుగా తాము కాలేజీల్లో పనిచేస్తున్నామన్నారు. రెండేళ్ల నిబంధనతో సంబంధం లేకుండా మానవతా దృక్పథంలో బదిలీకి అవకాశం ఇవ్వాలని బుర్ర వెంకటేశం కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు అధ్యాపకులు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సిరిగా రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు నరహరి, ప్రసాద్ తదితరులున్నారు.

హరిత రిసార్ట్ వద్ద ఆందోళన



అందోళన చేస్తున్న కడెం వాసులు

కడెం: మండల కేంద్రంలోని హరిత రిసార్ట్ వద్ద మండల కేంద్రానికి చెందిన పలువురు గురువారం ఆందోళన చేశారు. తాము గతంలో ఇక్కడ నివాసాలు ఏర్పర్చుకుని ఉన్నామని, ప్రాజెక్టు నుంచి వరదలు వస్తాయని తమను అధికారులు ఖాళీ చేయించారని తెలిపారు. తర్వాత రిసార్ట్ నిర్మించి, తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని ఆరోపించారు. తమ ఇళ్ల స్థలాన్ని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అందోళనకారులకు కాంగ్రెస్ నాయకులు సతీశ్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు మద్దతు తెలిపారు.